కథ

వాణిశ్రీ

# తారుమారు

"లలితా! శ్రావణమాసంలో అంజలి పెళ్లి చేద్దామంటోంది మా వదిన. నువ్వేమంటావు?" అన్నాడు వెంకట్రామయ్య చెల్లెలితో.

లలిత అన్నతో ఏం చెప్పాలా? అని ఆలోచనలో పడింది. ఒకప్పుడైతే ఇలా ఆలోచించాల్సిన పని ఉండేది కాదు. ఎందుకంటే తన కొడుక్కి అన్న కూతుర్ని చేసుకోవాలని చిన్నప్పటి నుంచి అనుకుంటున్నదే. శేఖర్ బి.కామ్ పాసై ఒక ఆడిట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. ప్రైవేటు ఉద్యోగమైనా మంచి భవిష్యత్తు ఉంటుందని కంపెనీ యజమాని చెప్పినప్పుడు లలిత సంతోషించింది. త్వరలో అన్నకూతురితో పెళ్లి చేస్తే తమ బాధ్యత తీరిపోతుందని భర్తతో అన్నది. దానికి నారాయణ కూడా తల ఊపాడు.

అయితే నారాయణ అకస్మాత్తుగా గుండె పోటుతో మరణించాడు. అతను గవర్నమెంటు ఆఫీసులో రికార్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. శేఖర్ డిగ్రీ హోల్డర్ కావడంతో ఆఫీసు సూపరింటెండెంట్ అతనికి జూనియర్ అసిస్టెంట్ జాబ్ ఇస్తామని చెప్పాడు. గవర్నమెంట్ ఉద్యోగం వదులుకోవద్దని వెంకట్రామయ్య కూడా చెల్లెలికి, మేనల్లుడికి సలహా చెప్పాడు.

శేఖర్ ప్రైవేట్ జాబ్‌కి రిజైన్ చేసి గవర్నమెంట్ ఆఫీసులో జూనియర్ అసిస్టెంట్‌గా చేరాడు. కొన్నాళ్ల తర్వాత అతని ఆలోచనలలో మార్పు వచ్చింది. ఆఫీసులో కొలీగ్స్ కొందరు భార్యాభర్తలు ఇద్దరూ ఉద్యోగాలు చేసుకుంటున్నారు. అటువంటి వాళ్ల ఆర్థిక పరిస్థితి బాగుంది. తన తండ్రి ఒంటి చేత్తో సంపాదించడం వల్ల ఎప్పుడూ డబ్బుకి ఇబ్బందులు పడుతూ ఉండేవాళ్లు. ఫస్ట్ తారీఖు ఎప్పు డొస్తుందా అని ఎదురుచూడాల్సి వచ్చేది. శేఖర్ అక్క పెళ్లికి చాలా అప్పులు చేశారు. అవి తండ్రి చనిపోయిన తర్వాత వచ్చిన గ్రాట్యుటీ వగైరాలతో తీర్చాల్సి వచ్చింది. అదే భార్యాభర్తలు ఇద్దరూ ఉద్యోగాలు చేసుకుంటూ ఉంటే హేపీగా ఉంటుంది గదా! అదే ఆలోచన వచ్చింది శేఖర్‌కి.

తల్లి పెళ్లి విషయం కదిపినప్పుడు తన మనసులో మాట చెప్పాడు శేఖర్.

"అమ్మా! ఏదైనా ఉద్యోగం చేస్తున్న అమ్మాయిని పెళ్లి చేసుకోవాలనుకుంటున్నాను."

లలిత ఆశ్చర్యపోయింది.

"అదేంట్రా! మావయ్య కూతుర్ని చేసుకోవాలని చిన్నతనం నుంచి అనుకుంటున్నదేగా? ఇప్పుడు కాదంటే ఏమనుకుంటారు? గవర్నమెంట్ ఉద్యోగం రాగానే మనుషులు మారిపోయారనుకోరూ? కట్నాల కోసం ఎగబడుతున్నారనీ, డబ్బు మనుషులైపోయారనీ రకరకాలుగా అనుకుంటారు మన చుట్టాలు గూడా!" అన్నది లలిత.

"సర్లేమ్మా! నేను అంజలినే చేసుకుంటాను. ఇప్పుడు మాకు పెద్ద వయసేముంది? దాన్ని డిగ్రీ చదవమని చెప్పు. ఏదో ఒక జాబ్‌లో చేరొచ్చు. ఆ తర్వాత పెళ్లి..." శేఖర్ తల్లికి మధ్యేమార్గం చెప్పాడు.

"అది ఇంటర్ చదివింది కదా ఏదైనా ఉద్యోగం రాదంటావా?"

"ఆ క్వాలిఫికేషన్తో ఏం వస్తుందమ్మా! ఇప్పుడు డిగ్రీ మినిమమ్. ఎవరైనా డిగ్రీ ఉందా అని అడుగుతారు" అన్నాడు శేఖర్.

లలిత ఆలోచిస్తోంది. ఇప్పటివరకు అన్న తనతో పెళ్లిప్రస్తావన తేలేదు. భర్త చనిపోయి సంవత్సరం గడిచింది గనుక ఇప్పుడు కదిపాడు.

"అన్నయ్యా! శేఖర్ అంజలిని డిగ్రీ చదివించమంటున్నాడు" అని కొడుకు మనసులో మాట చెప్పింది.

వెంకట్రామయ్య కూడా మేనల్లుడి మనసు అర్థం చేసుకున్నాడు.

"చదివించడానికి నాకేం అభ్యంతరం లేదమ్మా! కాకపోతే మీ వదిన తొందరపడుతున్నది. సరే చేసుకోబోయే వాడికి తొందర లేనప్పుడు మాకు మాత్రం ఏం? ఈ రోజుల్లో ఆడపిల్లలకు ఎంత చదివిస్తే అంత మంచిది. ఉద్యోగాల్లో రిజర్వేషన్స్ కూడా ఉన్నాయి. శేఖర్ ఆలోచన కూడా బాగానే ఉంది. భార్యాభర్తలు ఉద్యోగాలు చేసుకుంటూ ఉంటే, ఏదో వేడి నీళ్లకు చన్నీళ్లు తోడు" అన్నాడు వెంకట్రామయ్య.

అన్నయ్య ఏమంటాడో? అంజలిని చదివించడానికి ఒప్పుకుంటాడో లేదో? వేరే సంబంధం చూసి పిల్లపెళ్లి చేస్తానని అంటాడేమోనని మదనపడుతున్న లలిత మనసు శాంతించింది.

* * *

వెంకట్రామయ్య అంజలిని డిగ్రీ కాలేజీలో చేర్పించాడు. అంజలికి ఇక చదువే లోకం. కష్టపడి చదివింది. డిగ్రీ పాసైంది. అంజలి స్నేహితురాలు నాన్సీ సివిల్స్‌కి ప్రిపేరవుతూ ఆమెను గూడా ఎంకరేజ్ చేసింది. అంజలి సివిల్స్ సిలబస్ మీద పడింది.

వెంకట్రామయ్య చెల్లెలింటికి వెళ్లి అంజలి డిగ్రీ పాసైందనీ ఇక పెళ్లి చేస్తే సరిపోతుందని అన్నాడు. కానీ శేఖర్ మళ్లీ వాయిదా వేశాడు.

"మావయ్యా! నేను డిపార్టుమెంటల్ టెస్ట్‌కి ప్రిపేరవుతున్నాను. పాసైతే ప్రమోషన్ వస్తుంది. జీతం పెరుగుతుంది. పెళ్లయితే మళ్లీ చదువుకోవడం కుదరదు" అన్నాడు.

"సర్లేరా! అంజలి గూడా సివిల్స్‌కి ప్రిపేరవుతోంది. నువ్వు శ్రద్ధగా చదువుకుని డిపార్ట్‌మెంటల్ టెస్ట్ పాసవ్వు. గొడవ వదిలిపోతుంది. నువ్వన్నట్లు పెళ్లయితే చదవడం కుదరదులే" అన్నాడు వెంకట్రామయ్య.

శేఖర్ పకపక నవ్వాడు.

"సివిల్స్‌కి ప్రిపేరవుతోందా? పెద్ద కలెక్టరైపోవాలనుకుంటోందా?" అన్నాడు.

"ఏమోలేరా! దాని ఫ్రెండెవరో చదువుతోందట. ఇదీ మొదలుపెట్టింది. ఏదో కాలక్షేపం చెయ్యనీ. ఖాళీగా ఉండడం ఎందుకు?" అన్నాడు వెంకట్రామయ్య.

"దాని బదులు కంప్యూటర్ కోర్సులు చేస్తే మంచిది మావయ్యా! ఇప్పుడు ఏ ఉద్యోగానికెళ్లినా కంప్యూటర్ నాలెడ్జ్ గురించి అడుగుతున్నారు" అన్నాడు శేఖర్.

"సరే! నేను అంజలికి చెప్తాలే" అన్నాడు వెంకట్రామయ్య.

ఇంటికెళ్లిన తర్వాత వెంకట్రామయ్య కూతురుతో శేఖర్ చెప్పిన విషయం చెప్పాడు.

అంజలి ఏం మాట్లాడలేదు. కొంచెం సేపు ఆలోచించింది.

"ఇదేదో చదువుతున్నాగా! ఎగ్జామ్స్ అయ్యాక చూద్దాంలే. మధ్యలో మానడం ఎందుకు? నాన్సీ నేను కంబైండ్ స్టడీస్ చేస్తున్నాం. నేనిప్పుడు కంప్యూటర్ కోర్సులకు వెళ్తుంటే నాన్సీకి నాకు టైమింగ్స్ కుదరవు" అన్నది.

వెంకట్రామయ్య తలూపి వెళ్లిపోయాడు.


* * *

శేఖర్ డిపార్ట్‌మెంటల్ టెస్ట్ గట్టెక్కలేకపోయాడు. అది పాసైతే గానీ ప్రమోషన్ రాదు. మళ్లీ పరీక్ష ఫీజు కట్టి చదువు మొదలుపెట్టాడు.

అంజలి సివిల్స్ పాసైంది. ఐ.ఏ.ఎస్ ట్రైనింగ్‌కి వెళ్లింది. లలిత సంతోషించింది కోడలు కలెక్టర్ అవుతుందని తెలిసి. వెంకట్రామయ్య దంపతుల ఆనందానికి హద్దు లేదు.

కొంత కాలానికి అంజలి జిల్లా కలెక్టరైంది. శేఖర్ డిపార్టుమెంటల్ టెస్ట్ పాసయ్యాడు. కానీ అప్పటికే సీనియర్ అసిస్టెంట్స్ పోస్టులు అతని తర్వాత చేరినవాళ్లతో టెస్ట్‌లు పాసయ్యారనే కారణంతో పూర్తి చేశారు. శేఖర్ జూనియర్ అసిస్టెంట్‌గానే కొనసాగుతున్నాడు.

వెంకట్రామయ్య దంపతులు అంజలితోపాటు కలెక్టర్ బంగళాలో నివాసముంటున్నారు.



లలిత ఒక రోజు అన్నగారిని కలుసుకోవడానికి కలెక్టర్ బంగళాకి వెళ్లింది. ముందు గేటు దగ్గర సెక్యూరిటీ గార్డులు పోనివ్వలేదు. తను కలెక్టర్ మేనత్తనని మొత్తుకుంటే ఫోన్‌లో ఆ విషయం నిర్ధారణ చేసుకుని పోనిచ్చారు.

"లలితా! నువ్వు ఫోన్ చేసి ఉంటే ఇంటికి కారు పంపించే వాళ్లం కదా?" అన్నాడు వెంకట్రామయ్య హుందాగా నవ్వుతూ.

"అనుకోకుండా వచ్చాలే" అని అసలు సంగతి బైటపెట్టింది. అంజలి పెళ్లి శేఖర్‌తో జరిపించే విషయం అది.

వెంకట్రామయ్య డైలమాలో పడ్డాడు.

"అత్తయ్యా! బాగున్నావా?" అంటూ వచ్చింది అంజలి.

"ఆ.. బాగున్నాను" అన్నది లలిత.

"లలితా! నువ్వే అడుగు అమ్మాయిని" అని తను తప్పుకున్నాడు వెంకట్రామయ్య.

"ఏ విషయం నాన్నా? అన్నది అంజలి.

"చెప్పు లలితా!" అన్నాడు వెంకట్రామయ్య.

"ఇదేం కొత్త సంగతా అన్నయ్యా! ఎప్పటి నుంచో వాయిదా పడుతున్నదేగా? అదేనమ్మా నీ పెళ్లి విషయం" అన్నది లలిత.

"ఇప్పుడిప్పుడే పెళ్లి చేసుకునే ఉద్దేశ్యం లేదత్తయ్యా!" అన్నది అంజలి.

"అదేమిటమ్మా! అలా అంటావు? అవతల మీ బావ తొందరపడుతున్నాడు" అన్నది లలిత.

అంజలి పక్కున నవ్వింది.

"అత్తయ్యా! ఇక ఆ విషయం మర్చిపో. నేనిప్పుడు జిల్లా కలెక్టర్ని. బావ జూనియర్ అసిస్టెంట్. నన్ను పెళ్లిచేసుకునేవాడు నా కన్నా పై స్థాయి కాకపోయినా సమానస్థాయిలో ఉండాలి. లేదంటే చికాకులొస్తాయి. కాబట్టి బావకి తగిన సంబంధం చూసి పెళ్లి చెయ్యి" అన్నది అంజలి.

లలితకి నోట మాట రాక దిగ్భ్రాంతితో అంజలిని చూస్తూ ఉండిపోయింది.

"సారీ అత్తయ్యా! నాకు ఆఫీసు టైమైంది" అని కారెక్కి వెళ్లిపోయింది అంజలి.